టమాటా

- దారుణంగా పడిపోయిన టమాట ధరలు
- కన్నీరు పెడుతున్న రైతులు
- 7, 8 నెలల నుంచి తగ్గుతున్న ధరలు
- రైతులకు కిలో రూ.2 నుంచి రూ.6 మాత్రమే పలుకుతున్నది
- పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన

చేవెళ్ల శివారులో ధర లేక వదిలేసిన టమాట పంట చేను

చేవెళ్లటౌన్, మార్చి 28 : టమాట పంట రైతుల కంట కన్నీరు తెప్పిస్తున్నది. దిగుబడి పెరిగి కష్టాలు తీరుతాయని ఆశించిన రైతులు మార్కెట్లో ధరలు చూసి ఆవేదన చెందుతున్నారు. దాదాపు 7, 8 నెలల క్రితం నుంచి టమాట ధర పతనమై రైతుల జీవితాల్లో తీవ్ర అందోళనను కలిగిస్తున్నది. పంట సాగుకు పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు. మార్కెట్‌లో కిలో రూ.2 నుంచి రూ.6 మించి ధర పలకడం లేదు. ఈ ధరలతో లాభాల మాట దేవుడెరుగు కనీసం పెట్టుబడి వస్తే చాలని రైతులు భావిస్తున్నారు. ధరలు లేక రైతులు పొలాల్లోనే వదిలి వేస్తున్నారు. మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన 25కిలోల టమాట బాక్స్ ధర రూ.50నుంచి 150 మాత్రమే పలుకున్నది. ఈ ధరలతో తమకు గిట్టుబాటు ధర కూడా కావడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ ధరలతో నష్టాలే తప్ప లాభాలు లేవంటున్నారు. టమాట ఎకరా సాగుకు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులకు రూ.70వేల నుంచి రూ.80 వేల వరకు రైతులు ఖర్చు చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.2నుంచి రూ.6 వరకు ధర పలుకుతుండడంతో రైతులకు నష్టాలే తప్ప లాభాలు ఆర్జించడం లేదు. కనీసం 25 కిలోల టమాట బాక్స్ రూ.400 నుంచి రూ.500 వరకు కలికితే రైతులకు పెట్టుబడితో పాటు లాభాలు వస్తాయి. చిరు వ్యాపారులు మాత్రం కిలో టమాట రూ.10నుంచి రూ.20 విక్రయిస్తున్నారు. రైతులకు మాత్రం పెట్టుబడి కూడా రాకపోవడంతో వ్యవసాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



టమాట ధరలు అంతంతే...

టమాట ధరలు మార్కెట్లో ఎప్పుడు పెరుగుతాయో అప్పుడే అకు కూరలతో పాటు ఇతర కూరగాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌లోకి ఎక్కువగా టమాట రైతులు వస్తుంటారు. ఏడు, ఎనిమిది నెలలుగా ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇప్పుడు ఉన్న ధరలతో రైతులకు నష్టాలే తప్ప లాభాలు రావు. **- రాఘవేందర్‌గుప్తా, మార్కెట్ ఏజెంట్, చేవెళ్ల**

పెట్టిన పెట్టుబడులు రాలే..

రెండు ఎకరాల పొలంలో టమాట సాగు చేశాను. కూలీ, రవాణా ఖర్చులు కూడా రాలే. మార్కెట్లోకి టమాటలు తీసుకొద్దామనుకుంటే రవాణా ఖర్చులు కూడా అధికమయ్యాయి. ధరలు పెరుగుతాయని చూసినా ప్రయోజనం లేదు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు. టమాట రైతులను ప్రభుత్వమే అదుకోవాలి.

- బందయ్య రైతు, ఎన్మెపల్లి, చేవెళ్ల మండలం

అప్పులే మిగిలాయి..

రూ.లక్ష 40 వేల పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల పొలంలో టమాట పంట సాగు చేశాను. పంటది గుబడి బాగానే ఉంది. ధర మాత్రం లేదు. 25కిలోల టమాట బాక్స్‌కు రూ.50 నుంచి రూ.150 ఇస్తున్నారు. ఈ ధరకు టమాటలు తెంపితే కనీసం కూలీల ఖర్చులు కూడా మిగలక పోగా చేతి నుంచి డబ్బులు కట్టాలి. ప్రభుత్వం టమాట రైతులను అదుకోవడానికి శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలి.

- వెంకటయ్య, రైతు, చెర్లగూడెం, షాబాద్ మండలం

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్
- పలు పోటీల నిర్వహణ, విజేతలకు బహుమతులు అందజేత

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, మార్చి 28 : దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత గొప్ప లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలన్నారు. నచ్చిన రంగాల్లో యువత ప్రత్యేక సాధనతో పాల్గొని దేశ, విదేశాల్లో తమ ప్రతిభను చాటుకునే అవకాశం ఉంటుందని వివరించారు. క్రీడా, సాంస్కృతిక ఇతర వైవిధ్య రంగాల్లో రాణించేలా కృషి, పట్టుదలతో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తమ ప్రతిభను చాటాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత కోసం ఎన్నో కార్యక్రమాలు తీసుకొస్తూ ప్రోత్సహిస్తున్నదని, వాటిని అందిపుచ్చుకొని తమ జీవితాల్లో అనుకున్న గమ్యాలకు చేరేలా పాటుపడాలని సూచించారు. ఎందరో మహానీయులు దేశ ఐక్యత కోసం కృషి చేసిన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ సూచించారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. ప్రపంచంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక, వ్యాపార రంగాల్లో సానుకూల దృక్పథం తో ముందుకెళ్లాలని తెలిపారు. యువ ఉత్సవ్‌లో భాగంగా పాటలు, జానపద, పల్లె నృత్య, సైన్స్ ఫెయిర్, డ్రాయింగ్, కవితలు తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి ఐసయ్య, డీవైఎస్‌వో హనుమంతరావు, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఉప వైద్యాధికారి జీవరాజ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జున్, రామ సుబ్బారెడ్డి, వివిధ కళాశాలల విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సీఎం రాక.. ఏర్పాట్ల పరిశీలన

కొడంగల్, మార్చి 28 : పట్టణంలోని మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామి వారిని దర్శించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం కొడంగల్‌కు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం అధికారులు నిర్వహిస్తున్న ఏర్పాట్లనుకలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో పాటు ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించి పలు సూచనలు సలహాలను అందించారు. శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం సాయంత్రం స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆలయ ఈవో రాజేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి శ్రీదర్‌రెడ్డి, ఎలక్ట్రిసిటీ ఏడీ అర్జున్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు

- ఎస్పీ నారాయణ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 28 : పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం జిల్లా పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేశామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కో-ఆపరేటివ్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సొసైటీ సభ్యులు, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా గతేడాది చేపట్టిన కార్యక్రమాలు, అందించిన సేవలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బందికి అకాల మరణం, ప్రమాదాలు, ఇతర అత్యవసర సందర్భాల్లో కో-ఆపరేటివ్ సొసైటీ నుంచి ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. సిబ్బంది రిటైర్మెంట్ సమయంలో ఆర్థిక సహాయం, పిల్లల విద్యా సహాయం, వైద్య సేవలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలు, కొత్త ప్రణాళికలు, అమలు విధానాలపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ ఆమోదించామని, పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుండి సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టీవీ హనుమంత రావు, ఏవో జోతిర్మయి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు, పోలీసు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, ఎస్సైలు,ఆర్ ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎంపీడీవో వెంకయ్యకు ఆస్తిపన్ను చెక్కు అందజేస్తున్న మోకిలాలోని లా పలోమా విల్లాస్ నిర్వాహకులు, పక్కన డీపీవో సురేశ్ మోహన్

జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్

చేవెళ్ల రూరల్, మార్చి 28 : గ్రామ పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లపై నిర్లక్ష్యం వహించిన అధికారులు, జీపీ సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ హెచ్చరించారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిలాలో ఆయన పర్యటించారు. మోకిలాలోని లా పలోమా విల్లాస్ నిర్వాహకులు రూ.12,100 ఆస్తి పన్నుకు సంబంధించిన చెక్కును డీపీవో సమక్షంలో ఎంపీడీవో వెంకయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా డీపీవో సురేశ్ మోహన్ మాట్లాడుతూ.. అధికారులు 100 శాతం పన్ను వసూళు చేయాలని, ఈ రెండు రోజుల్లో ప్రజలు సహకరించి విధిగా ట్యాక్స్‌లు పే చేయాలన్నారు. పన్నులు చెల్లించని యజమానులకు జప్తు నోటీసులు జారీ చేయాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ప్రజలకు తెలిపారు. డీపీవో వెంట శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్, ఎంపీవో గిరిరాజ్, మోకిలా పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య ఉన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

డీఎండబ్ల్యూవో హనుమంతరావు

వికారాబాద్, మార్చి 28 : రాజీవ్ యువ వికాస పథకం ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఎండబ్ల్యూవో హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా మైనార్టీలు ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీల కోసం అర్హులైన అభ్యర్థులు OBMMS పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in ద్వారా ఏప్రిల్ 5లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వ్యవసాయ పథకాలకు 21-55 ఏండ్లు (జూలై 1 నాటికి), వ్యవసాయ, సంబంధిత రంగాలకు 21 నుంచి 60 ఏండ్లలోపు ఉండాలని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.1.50లక్షలోపు, పట్టణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.2 లక్షలకు మించకుండా ఆదాయం ఉండాలన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని సూచించారు. రవాణా పథకాలకు డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదార్ పాస్ బుక్, దివ్యాంగులకు సదరం ధ్రువపత్రం ఉండాలన్నారు. వీటిలో మహిళలకు కనీసం 25 శాతం, ఒంటరి, వితంతువులు, దివ్యాంగులు కనీసం 5 శాతం అర్హులని తెలిపారు. తెలంగాణ ఉద్యమ వీరులు, ఎస్సీ ఉపవర్గ ఉద్యమాల్లో త్యాగం చేసిన వారి కుటుంబాలు, స్వయం ఉపాధిలో నైపుణ్యం ఉన్నవారు OBMMS పోర్టల్‌లో నమోదు చేసుకొని ఆ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని పైన సూచించిన పత్రాలతో అందజేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల వారు మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల వారు మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. ఒక కుటుంబానికి/రేషన్ కార్డుకి చెందిన వారు ఐదేండ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి (సబ్సిడీ) పొందితే అనర్హులన్నారు. ఆర్థికంగా సాధ్యమయ్యే స్వయం ఉపాధి పథకాన్ని ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

సుప్రీంకోర్టు న్యాయవాది భగవాన్‌శ్రీ అనంతవిష్ణును సన్మానిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు

కేశంపేట, మార్చి 28 : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని సుప్రీంకోర్టు న్యాయవాది భగవాన్‌శ్రీ అనంతవిష్ణు అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో వారం రోజులపాటు సాగిన తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు వేడుకల్లో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో జరిగే అనర్థాలు, అవకతవకలపై ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడితే మనం భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాయువును అందించగలమన్నారు. గిరిజన చట్టాలు, గోబర్ గ్యాస్ తయారీ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుంది

ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా విద్యార్థులు క్షేత్ర ప్రదర్శనకు వెళ్లడం ద్వారా అక్కడ ఎదురైన అనుభవాలు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు కావాల్సిన అనుభవం వస్తుందని ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. గ్రామంలో వారం రోజుల పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎంతో శ్రమపడి అనేక విషయాలను తెలుసుకోవడంతో పాటు చదవడం, రాయడం రానివారికి పేరు రాసేలా శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత విషయంలో గ్రామంలోని ప్రజలను చైతన్యం చేయడం సంతోషకరమని, విద్యార్థులు పొందిన అనుభవం భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మద్యం సేవించడంతో అనారోగ్య సమస్యలు, అనర్థాలపై విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శన ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీతాపొలె, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్లు అఫ్రోజ్ జహాన్, బింధుశ్రీ, కార్యదర్శి రాఘవేందర్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపకార వేతన దరఖాస్తు గడువు పొడిగింపు

వికారాబాద్, మార్చి 28 : పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకం ద్వారా అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థినీ విద్యార్థుల బోధన రుసుం, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు గడువును మార్చి 31 నుంచి మే 31 వరకు పొడగించామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2024-25 సంవత్సరంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో 2,447 విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా కేవలం 1,654 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇంకా 823 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నదన్నారు. వివిధ రకాల వృత్తి పరమైన కోర్సుల ప్రవేశాలు ఇంకా జరుగుతున్నాయన్నారు. అలాగే ప్రవేశము పొందిన విద్యార్థుల వివరాలు కూడ సంబంధిత యూనివర్సిటీల వారు సమర్పించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోని వారిని కళాశాల యాజమాన్యాలు www.epass.cgg.gov.in నందు మే 31 వరకు దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు.

వాంతులు.. విరేచనాలు.. జ్వరం

'ఫివర్' ఆసుపత్రికి నగరవాసుల క్యూ

బయట లభించే శీతల పానియాలే కారణమంటున్న వైద్యనిపుణులు

సిటీబ్యూరో, మార్చి28, (నమస్తే తెలంగాణ): మన శరీరానికి కాస్తంత ఎండ తగిలితే చాలు.. శీతల పానియాలు తాగేందుకు వెనుకాడం. ఇక ఎండాకాలం వస్తే చెప్పనవసరం లేదు. రోడ్లపైన కనిపించే కూల్‌డ్రింక్ దుకాణాల ముందుకు పరుగులు తీస్తూ వెళ్లి మరీ తాగుతాం. అయితే ఎక్కడపడితే అక్కడే నాణ్యత, పరిశుభ్రత విషయాలు పక్కన పెట్టి వెంటనే చల్లగా ఐస్ వేసుకొని తాగుతారు. మరీ ఆ ఐస్ శుభ్రంగా ఉందో లేదో కూడా క్షణమైనా ఆలోచించకుండా ఆ పానీయాలు తాగి చివరకు వాంతులు, విరేచనాలకు గురవుతారు. దీంతో క్రమంగా జ్వరాల బారిన పడతారు. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లాలో ఇదే ధోరణి కొనసాగుతున్నది. నల్లగుంటలో ఉన్న ఫివర్ ఆసుపత్రికి మూడు రోజుల నుంచి 1400 వరకు ఔట్ పేషెంట్లు వాంతులు, విరేచనాలు, జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం రావడం ఆందోళనను కలిగిస్తున్నది.

ఓపీల్లో అధిక శాతం వారే..

హైదరాబాద్ జిల్లాలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అందులో భాగంగా ప్రజలు ఎండ నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలను విపరీతంగా తాగుతున్నారు. రోడ్ల పక్కన పుట్‌పాత్‌లపై, బండ్లమీద, బేకరీల్లో విక్రయించే కూల్ డ్రింక్స్‌ను లొట్టలేసుకుంటూ.. తాగుతున్నారు. నిజానికి చెరుకు రసం, ఇతర శీతల పానీయాలు తయారు చేసేందుకు వాడే ఐస్ అపరిశుభ్రంగా ఉండటం, చుట్టూ ఈగలు చేరడం మూలానా వాటిని తాగిన వెంటనే గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం జిల్లాలోని కింగ్‌కోటీ, ఫివర్, ఏరియా, బస్తీ దవాఖానాల్లో అనారోగ్యంతో వచ్చే ఔట్‌యపేషెంట్లలో అధిక శాతం జ్వరం, గొంతు నొప్పి, వాంతులు వంటి సమస్యలతో బాధపడుతున్నవారే ఉండటం గమనార్హం.

ముప్పు వాటివల్లే..

బయట నిమ్మరసం, చెరుకు రసం వంటి శీతల పానీయాల్లో వేసే ఐస్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు. ఐస్ తయారీ అనంతరం దాన్ని తరలించేందుకు ఆటోలు, ఇతర వాహనాల్లో తరలించే సందర్భంలో అనేక క్రిములు దానిపై చేరుతాయి. అనంతరం డ్రమ్ములో దాన్ని నిల్వచేసి, మనకు కూల్ డ్రింక్స్‌లో కలిపి దుకాణదారులు ఇస్తారు. వాటిలో ఏర్పడే క్రిములు మన శరీరంలోకి చేరి, అనారోగ్య సమస్యలకు దారి తీస్తాయి. దీంతో రోగాలతో బాధపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

జాగ్రత్తలు తప్పనిసరి

- డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రజలు తప్పనిసరి జాగ్రత్తలు తీసుకోకుంటే జ్వరాల బారిన పడాల్సి వస్తుంది. బయట లభించే శీతల పానియాలు తాగటం మానుకోవాలి. చాలా మంది పేషెంట్లు పానీపూరి వంటి చెడు తిండ్లు తిని అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చేరుతున్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండండి. స్వీయ జాగ్రత్తలు పాటించండి. ఎండలో వడదెబ్బకు గురికాకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకొని నీటిలో కలుపుకొని తాగండి.

ఇసుక కొనేదెట్ల? ఇల్లు కట్టేదెట్ల?

హైదరాబాద్‌లో ఇసుక కష్టాలు!

కాంగ్రెస్ పాలనలో ఖరీదైన వైనం

టన్ను రూ.1700 నుంచి 2000 పైనే..

ఇసుక బజార్‌లో కంటే ప్రైవేట్‌గానే తక్కువ

వెలవెలబోతున్న వట్టినాగులపల్లి సాండ్ బజార్

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో ఇసుక కొనేదెట్టా.. ఇల్లు కట్టేదెట్టా? అనే పరిస్థితి నెలకొన్నది. భాగ్యనగరంలో సామాన్యుడి సొంతింటి కలకు ఇసుక ధరలు అడ్డుపడుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ప్రైవేటు ఇసుక ఏజెన్సీలను తొలగించడంతో ప్రభుత్వ ఇసుక బజార్లలో కొనాలంటే కొనలేని పరిస్థితి. టన్ను ఇసుక దొడ్డు రకం రూ.1600, సన్నరకం రూ.1800కు విక్రయిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటుచేసిన ఇసుక కొనుగోలు కేంద్రాలకు 'ఇసుక బజార్' అని పేరు మార్చారు. ఈ కొనుగోలు కేంద్రాలు హైదరాబాద్ శివారు ప్రాంతాలైన వట్టినాగులపల్లి, భౌరంపేట, అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉన్నాయి. ఇక్కడి నుంచి ఇసుక కొనుగోలు చేయాలంటే రవాణా ఖర్చు తడిచి మోపెడవుతున్నది. అసలు ధర కంటే రవాణాకే జేబు ఖాళీ అవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిటీలోని కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటుగా ఇసుక విక్రయించుకునేందుకు అనుమతులు ఉండటంతో ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు అవి లేకపోవడంతో టన్ను ధర రూ.1600కు కొనుగోలు చేస్తే, రవాణా, బుకింగ్, ఇతర ఖర్చులతో కలిపి రూ.2000 పైనే అవుతున్నది. దీంతో సామాన్యుడు ఇల్లు కట్టడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఇసుక బజార్ల కంటే బయటే తక్కువ..

ఇసుక బజార్ నుంచి కొనుగోలు చేయాలంటే ముందుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలి. కొనుగోలుదారుడే వాహనం తీసుకెళ్లాలి. ఒక్కో ట్రిప్పునకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకుంటున్నారు. ఈ లెక్కన పది టన్నుల ఇసుక కొనుగోలుకు ప్రభుత్వ ధర కంటే అదనంగా మరో రూ.2 నుంచి 5 వేల వరకు అవుతున్నది. ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయిస్తే టన్ను ఇసుకపై రూ.100 నుంచి రూ.200 వరకు తీసుకుని ఎలాంటి రవాణా చార్జీలు తీసుకోకుండా ఇంటికొచ్చి అన్‌లోడ్ చేసి వెళ్తున్నారు. బుకింగ్, రవాణా కోసం తిరగాల్సిన పని ఉండదు. ఎలాంటి ఇబ్బందులు, వ్యయప్రయాసలు లేకుండా ఇసుక ఇంటికే వస్తున్నప్పుడు ప్రభుత్వ విక్రయ కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేదని పేర్కొంటున్నారు.

ఇసుక బజార్లు వెలవెల..

నగరంలోని ప్రైవేట్ ఇసుక కేంద్రాలను ప్రభుత్వం తొలగించినా ఇల్లు కట్టుకునేవారు ఇసుక బజార్ల వైపు వెళ్లడం లేదు. దీంతో అవి వెలవెలబోతున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు ఇసుక రీచ్‌ల నుంచి నేరుగా ఇంటికే సరఫరా చేస్తుండటంతో వారినే ఆశ్రయిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని, ఇసుక కూడా సులువుగా దొరకని పరిస్థితి నెలకొన్నదని బాధితులు వాపోతున్నారు.

ఇంటికే వస్తుంటే ఇసుక బజార్లెందుకు?

కోకాపేటలో నాలుగు ఫ్లోర్ల ఇల్లు కడుతున్నా. 25 టన్నుల ఇసుక అవసరం ఉన్నది. తెలిసిన వ్యక్తి ద్వారా ప్రైవేట్ వారిని ఆశ్రయించా. రవాణా చార్జీతో కలిపి టన్నుకు రూ.1900 పడుతుంది. ఇంటి ముందుకు వచ్చి అన్‌లోడ్ చేసి వెళ్తున్నారు. ఇసుక బజార్‌లో తీసుకుందామంటే టన్ను రూ.1600 చెప్పిండ్రు. బుక్ చేసుకోవాలంటే నార్సింగి వెళ్లాలి. అక్కడ రశీదు తీసుకుని వట్టినాగులపల్లి ఇసుక బజార్‌కు వెళ్లాలి. వారికి రశీదు ఇచ్చి టిప్పర్‌ను కిరాయికి తీసుకెళ్లాలి. టిప్పర్‌కు రూ.2 వేల నుంచి రూ.3 వేలు అడుగుతున్నరు. ఇంత శ్రమ అక్కర్లేకుండానే ఒక్క ఫోన్‌తో ఇసుక ఇంటికే వస్తుంది. దీంతో ప్రైవేటుగానే కొనుగోలు చేస్తున్నా. **- అరికె కృష్ణ, కోకాపేట**

> *ఫిల్మ్‌నగర్‌లో ఓ వ్యక్తి జీప్లస్ వన్ ఇల్లు కట్టుకుంటున్నాడు. వట్టినాగులపల్లి ఇసుక బజార్ నుంచి ఇసుక తెచ్చుకోవడానికి రవాణా చార్జీలు, బుకింగ్ కోసం తిరగడానికి కలిపి టన్నుకు రూ.2200 అవుతుంది. తెలిసిన వ్యక్తి ద్వారా అత్తాపూర్‌లోని ఓ ప్రైవేట్ వ్యక్తిని సంప్రదించాడు. అత్తాపూర్ నుంచి ఎలాంటి బుకింగ్, రవాణా చార్జీ లేకుండానే రూ.2000 వేలకు టన్ను చొప్పున సరఫరా చేస్తున్నాడు. వ్యయప్రయాసలు లేకుండా ఇంటికే ఇసుక వస్తుండటం